క్లుప్తంగా

ఆంజనేయ స్వామి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమం



కొండరేజేరులో ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

మక్కువ: మండలంలోని కొండరేజేరు గ్రామంలో శనివారం ఘనంగా అభయాంజనేయ స్వామి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమం ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. వేదపండితులు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొని, అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. పర్ణశాలలో చండీహోమం పూజలు నిర్వహించారు. ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మక్కువ: మండల కేంద్రం మక్కువలో ఆదివారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఆ శాఖ ఏఈ వి.వి.కిశోర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మక్కువ సబ్‌స్టేషన్ వద్ద పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు జరపనున్నందున విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అభివృద్ధికి తొలి ప్రాధాన్యత



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తున్న ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పట్టణంలోని 24వ వార్డులో సీసీ కాలువల నిర్మాణానికి శనివారం ఉదయం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఇచ్చిన మాట ప్రకారం పలు అభివృద్ధి పనుల నిర్మాణ పనులు చేపట్టామన్నారు. గతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇచ్చిన హామీని పూర్తి స్థాయిలో నెరవేరుస్తూ వార్డు ప్రజల ఎన్నో ఏళ్ల నాటి ఆశయాన్ని నేడు నెరవేర్చడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, స్థానిక వార్డు కౌన్సిలర్లు నిమ్మకాయల సుధీర్‌కుమార్, లావణ్య, అనురాధ, స్థానిక కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

సీతానగరం: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నియమావళి తప్పనిసరిగా అమలు జరిగేలా అధికారులు పని చేయాలని తహసీల్దార్ అడబాల శ్రీనివాసరావు అన్నారు. తన కార్యాలయంలో వీఆర్‌ఓలు, బీఎల్‌ఓలతో ఎన్నికల నిర్వహణపై శనివారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చిందని అధికారులు నిశితంగా ప్రచారాన్ని, అభ్యర్థుల ఖర్చులను గమనించాలన్నారు. సమావేశంలో ఈఓపీఆర్‌డీ కె.కుమారవర్మ, ఇన్‌చార్జి ఆర్‌ఐ రామారావు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ సహాయకులు, వీఆర్‌ఓలు, డీఏలు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు జయంతి



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

బలిజిపేట: ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణ త్యాగం చేసిన మహనీయుని సేవలు మరుపురానివని నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు సంజీవ నాయుడు తెలిపారు. పెదపెంకిలో ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు పోరాడి ప్రాణ త్యాగం చేసిన మమనీయుడని అటువంటి వ్యక్తి జయంతిని పునస్మరణ చేసుకుని అతడి ప్రాధాన్యతను గుర్తించడం మన అందరి విధి అని తెలిపారు. ఎంతోమంది మహానుభావులు ఉన్నప్పటికీ పొట్టి శ్రీరాములు మనకు మహోపకారం చేశారన్నారు. అతడి త్యాగాన్ని భావి తరాల వారికి చాటి చెప్పేందుకు ఇటువంటి కార్యక్రమాలు అవసరమన్నారు. విద్యార్థులకు ఇటువంటి మహనీయుని గాథలు తెలియవలసి ఉందన్నారు. కార్యక్రమంలో ఎం.అప్పలరాజు, సీహెచ్ అప్పలనాయుడు, పి.పరుశురాం, కె.గౌరీనాథ్, జి.శ్రావణ్ పాల్గొన్నారు.

'కాశీపట్నం'లో అభివృద్ధి పరుగులు

- సుమారు రూ.2.60కోట్లతో అభివృద్ధి పనులు
- ఇది కదా అభివృద్ధి



గ్రామ సచివాలయం



గ్రామంలో సీసీ రోడ్లు, కాలువలు

మక్కువ: మండలంలోని కాశీపట్నం పంచాయతీలో అభివృద్ధి పరుగులు తీస్తుంది. సుమారు 2కోట్ల 60లక్షల రూపాయిలతో పంచాయతీ పరిధిలోని కాశీపట్నం, పాపయ్యవలస, ములక్కాయవలస, కొండరేజేరు, మేలాపువలస, మేలాపువలస కాలనీ, శ్రీదేవి కాలనీల్లో అభివృద్ధి పనులు జరిగాయి. కాశీపట్నం గ్రామంలో రూ.42లక్షలతో గ్రామ సచివాలయం నిర్మాణం జరగ్గా, రూ.48లక్షలతో కేజీబీవీ పాఠశాల నిర్మాణం జరుగుతుంది. అలాగే రూ.13.50 లక్షలతో సీసీ రోడ్లు, కాలువలు, గ్రావెల్ రోడ్లు నిర్మాణం జరిగాయి. గ్రామం సమీపంలో రూ.21.80లక్షలతో రైతుభరోసా కేంద్రం నిర్మాణం, రూ.17.50లక్షలతో వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవన నిర్మాణాలు జరిగాయి. రూ.40లక్షలతో ఏఎంసీ భవన నిర్మాణం, రూ.15లక్షలతో మిల్క్‌బల్క్ భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మేలాపువలస గ్రామంలో రూ.13.50లక్షలతో అంగన్‌వాడీ భవన నిర్మాణం జరగ్గా, గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.4లక్షలతో కాలువలు ఏర్పాటు చేశారు. రూ.23 లక్షలతో రక్షిత మంచినీటి పథకాలు ఏర్పాటు చేసి, ఇంటింటికి కుళాయిలు ద్వారా తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకున్నారు. పాపయ్యవలసలో రూ.5లక్షలతో సీసీ రోడ్లు కాలువలు, కొండరేజేరు గ్రామంలో రూ.3.30లక్షలతో కాలువలు సీసీరోడ్లు, ములక్కాయవలసలో రూ.14.50లక్షలతో సీసీరోడ్లు, కాలువలు నిర్మించారు. ఇది కదా అభివృద్ధి అంటే అని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి భేష్



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత మా పంచాయతీ పరిధిలో ఏడు గ్రామాలు చాలా అభివృద్ధి చెందాయి. గతంలో ఈ విధంగా ఎప్పుడు అభివృద్ధి చెందలేదు. సుమారు 2.60కోట్లతో ప్రభుత్వ భవనాలు, పాఠశాల భవనాలు, సీసీరోడ్లు, కాలువలు, రక్షిత మంచినీటి పథకాలు, గ్రావెల్ రోడ్లు, అంగన్‌వాడీ భవనాలు నిర్మించారు. పంచాయతీ పరిధిలో ఏ గ్రామంలో చూసినా అభివృద్ధి పనులు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

– కోట్ల నారాయణరావు, మాజీ సర్పంచ్, కాశీపట్నం పంచాయతీ

గ్రామంలోనే అన్ని సేవలు



గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనాలు నిర్మించడంతో, అధికారులు ఆయా కార్యాలయాల ద్వారా ప్రజలకు సేవలందిస్తున్నారు. గతంలో ఏ పని జరగాలన్నా, మండల కేంద్రం మక్కువ వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు అధికారులే మా గ్రామాలకు వచ్చి సమస్యలు పరిష్కరిస్తున్నారు. చాలా ఆనందంగా ఉంది.

– ఏగోటి అరుణకుమారి, మహిళ, కాశీపట్నం గ్రామం



వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనం



ఆర్‌బీకే భవనం



కేజీబీవీ పాఠశాల భవనం

రాజన్నా.. మా గుండెల్లో నీవు పదిలం

- వైఎస్సార్‌కు నివాళులర్పించిన ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఘాట్ వద్ద ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

సాలూరు: దివంగత ముఖ్యమంత్రి, మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర నివాళులు అర్పించారు. ఇడుపులపాయలో వైఎస్సార్ ఘాట్ వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలువురు ప్రముఖులతో పాటు ఆయన శనివారం నివాళులర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ప్రకటన సమావేశంలో పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ అందజేత

- 11 కుటుంబాలకు రూ.12లక్షల ఆర్థిక సహాయం
- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థికంగా ఆదుకున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. నియోజకవర్గంలోని మున్సిపాల్టీ, పార్వతీపురం, బలిజిపేట, సీతానగరం మండలాలకు చెందిన 11 కుటుంబాలకు రూ.12లక్షలు ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఆర్థిక సహాయాన్ని ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న బాధిత కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలవాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి సహాయ నిధికి సిఫార్సు చేయడం జరిగిందన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు కావడంతో ఎమ్మెల్యే వారికి చెక్కులను అందజేశారు.

పౌష్టికాహారాన్ని తీసుకోవాలి : ఆర్‌జేడీ



బంగారమ్మ కాలనీలో సామూహిక సీమంతాల కార్యక్రమంలో పాల్గొన్న ఆర్‌జేడీ చిన్మయిదేవి

సాలూరు: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు అంగన్‌వాడీల్లో అందిస్తున్న పౌష్టికాహారాలు తప్పనిసరిగా తీసుకోవాలని ఆర్‌జేడీ చిన్మయిదేవి అన్నారు. పట్టణంలోని బంగారమ్మ కాలనీలో శనివారం నిర్వహించిన గర్భిణులకు సామూహిక సీమంతాల కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పౌష్టికాహారాలు సక్రమంగా తీసుకోవడం వలన రక్తహీనతకు దూరంగా ఉండవచ్చని అన్నారు. తద్వారా ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని వివరించారు. ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాచిపెంట మండలంలో కోష్టువలస అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. అందిస్తున్న పౌష్టికాహారాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో సీడీపీఓ సత్యవతి, డాక్టర్ ప్రియాంక, అంగన్‌వాడీ నాయకురాలు బలగ రాధ, వైఎస్సార్‌సిపి నాయకురాలు రాంబాయి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు ఉచిత ప్రయాణం

పార్వతీపురం టౌన్: పదో తరగతి విద్యార్థులకు బస్సు ప్రయాణం ఉచితమని జిల్లా ప్రజా రవాణా అధికారి టీవీఎస్ సుధాకర్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు జరగబోయే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులకు పార్వతీపురం మన్యం జిల్లాలో పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగులు బస్సులలో వారి యొక్క హాల్ టికెట్‌ను చూపించి పరీక్ష కేంద్రం వరకు ఉచిత బస్సు ప్రయాణం చేయవచ్చని ఈ సౌకర్యం పరీక్షల తేదీలలో మాత్రమే వినియోగించుకోవాలని తెలిపారు.

ప్రత్యేక అవసరాల పిల్లలపై శ్రద్ధ కనబరచాలి

మక్కువ: ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలపై తల్లిదండ్రులు శ్రద్ధ కనబరచాలని భవిత కేంద్ర ఉపాధ్యాయులు ఆర్.శంకరరావు అన్నారు. స్థానిక హోలీ క్రాస్ సంస్థలో శనివారం పిల్లల తల్లిదండ్రులతో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. భవిత కేంద్రాలలో విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు ప్రత్యేక అవసరాలు గల పిల్లలపై దృష్టి సారించి ఉన్నత భవిష్యత్తుకు దోహదపడాలన్నారు. కార్యక్రమంలో హోలీక్రాస్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

సిర్లి ఎల్లమ్మ జాతరకు ఏర్పాట్లు

సీతానగరం: మండలంలోని సిర్లి ఎల్లమ్మ జాతరకు శనివారం ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు నిర్వహించారు. మండలంలోని అంటిపేట, సీతానగరం గ్రామాల్లో ప్రతి ఏటా సిర్లి ఎల్లమ్మ జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. దేవాంగుల వీధిలో కొలువైన ఎల్లమ్మ వారిని దర్శించుకోవడానికి భక్తులు ఆదివారం మధ్యాహ్నం వస్తారు. ఈ మేరకు శనివారం ఉదయం నుంచి సీతానగరంలో కమిటీ అధ్యక్ష కార్యదర్శులు సీహెచ్‌వీ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ జే.తేరేజమ్మ పర్యవేక్షణలో పారిశుద్ధ్య పనులు చేయించారు. దోమల నివారణకు బ్లీచింగ్ చల్లించారు. చాకలివీధి, దేవాంగుల వీధి, మార్కెట్, కర్రోతు వీధులను పరిశుభ్రం చేశారు.

ఉత్సాహంలో వైఎస్సార్‌సీపీ క్యాడర్

- జోగారావుకు టిక్కెట్ కేటాయింపుతో జోష్
- సర్వత్రా హర్షాతిరేకాలు



పార్వతీపురం టౌన్: కార్యకర్తలతో కలసి సంతోషం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు



సీతానగరం: ఎమ్మెల్యే అలజంగి జోగారావును సత్కరిస్తున్న ఎంపీపీ బి.రవణమ్మ దంపతులు, పార్టీ మండల నాయకులు



బలిజిపేటలో జోగారావుకు మద్దతుగా ర్యాలీ చేసిన నాయకులు, కార్యకర్తలు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం ఎమ్మెల్యేగా రెండోసారి టిక్కెట్ దక్కించుకున్న అలజంగి జోగారావును మళ్లీ గెలిపించుకొని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇస్తామని పార్టీ శ్రేణులు పేర్కొన్నారు. జోగారావుకు టిక్కెట్ దక్కడంతో రెట్టించిన ఉత్సాహంతో పని చేస్తామని క్యాడర్ పేర్కొంది. తనకు ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు మరొసారి అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. టిక్కెట్ రావడంతో పార్టీ శ్రేణులతో ఆయన శనివారం మమేకమయ్యారు.

జగనన్న రుణం తీర్చుకుంటాం

సీతానగరం: పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు రెండవ పర్యాయం టిక్కెట్ ఇచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తామంతా రుణపడి ఉంటామని ఎంపీపీ బి.రవణమ్మ, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, వైస్ ఎంపీపీ టి.సూర్యనారాయణ అన్నారు. శనివారం సాయంత్రం ఎమ్మెల్యే జోగారావును వారంతా శాలువాతో సత్కరించారు.

విజయమే లక్ష్యంగా పని చేయాలి

బలిజిపేట: రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డి, నియోజకవర్గ ఎమ్మెల్యేగా జోగారావులు తిరిగి అధికారాన్ని చేపట్టే వరకు అందరం కలిసి పని చేయాలని వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ అన్నారు. పార్వతీపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా తిరిగి ఎమ్మెల్యే జోగారావుకే అధిష్టానం టిక్కెట్టు కేటాయించడంతో మండలంలో పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. నాయకులు, కార్యకర్తలు వెంగాపురం సంతతోట నుండి బలిజిపేట సెంటరు వరకు ర్యాలీ నిర్వహించారు. బస్టాండులో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మహిళలే వైఎస్సార్‌సీపీ బ్రాండ్ అంబాసిడర్లు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



సమావేశానికి హాజరైన మహిళలు

పార్వతీపురం టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మహిళలే బ్రాండ్ అంబాసిడర్లు అని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని వెంకంపేట గ్రామం వద్ద వైఎస్సార్ చేయూత చెక్కుల పంపిణీ కార్యక్రమం శనివారం ఉదయం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థిక సాధికారతతోనే కుటుంబాలు ఆర్థిక పరిపుష్టి సాధిస్తాయన్నదే సీఎం జగన్ ఆకాంక్ష అన్నారు. ఇందుకు అనుగుణంగా పథకాలన్నీ మహిళల పేరిట అమలు చేస్తున్నారన్నారు. సీఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం అమ్మ ఒడి, డ్వాక్రా రుణమాఫీ, చేయూత విద్యాదీవెన, వసతి దీవెన, రూ.3వేల పింఛన్ వంటి పలు పథకాలు అమలు చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌ను ముఖ్యమంత్రిగా మరోమారు గెలిపించేందుకు మహిళలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. ఎన్ని ఇబ్బందులు తలెత్తినా తన అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ములు, అవ్వాతాతలు, కుటుంబీకులకు కష్టం రాకుండా చూసిన ఘనత జగనన్నదే అన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అర్హత మేరకు అందాయని, మీ కుటుంబానికి మంచి జరిగితేనే ఓటు వేయమన్న నిబద్ధత గల నాయకుడు సీఎం జగన్ అన్నారు. అనంతరం మండలానికి సంబంధించి మహిళలకు రూ.10.43 కోట్ల చెక్కును అందజేశారు. పార్టీ అభ్యున్నతికి చేయూత అందించే క్రమంలో ప్రతి కుటుంబం స్టార్ క్యాంపైనర్లు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శోభారాణి, ఏఎంసీ చైర్మన్ ఎం.భాగ్యశ్రీ, మండల పార్టీ అధ్యక్షుడు బోమ్మి రమేష్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వెంపల గురురాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

రాజీయే రాజ మార్గం

- ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.రమేష్

పార్వతీపురం టౌన్: కేసుల సత్వర పరిష్కారానికి రాజీయే ఉత్తమ మార్గమని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.రమేష్ అన్నారు. స్థానిక జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షిదారులు కేసులలో రాజీ పడటం వల్ల డబ్బు, సమయం వృథా కావని పేర్కొన్నారు. కేసులలో చిక్కుకుని కోర్టులలో కేసుల ద్వారా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇరువురు కేసులను రాజీ చేసుకుని సుహృద్భావ వాతావరణాన్ని కలిగించి, మిగిలిన కక్షిదారులకు ఆదర్శంగా నిలవాలని జడ్జి కోరారు. ప్రతీ మూడు నెలలకు జరిగే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కోర్టులు కూడా వీలైనన్ని కేసులను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నాయని పేర్కొన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 51 కేసులు రాజీ అయ్యాయి. సివిల్ కేసులు 9, మెయింటనెన్స్ కేసులు 2, క్రిమినల్ కేసులు 35, చెక్ బౌన్స్ కేసులు 4, సారా కేసు 1, పీఎల్‌సీ 1, బ్యాంక్ పీఎల్సీ 1 కేసు రాజీ ద్వారా పరిష్కరించారు. కార్యక్రమంలో ఫస్ట్ క్లాస్ అడిషనల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ డి.సౌజన్య, బార్ కౌన్సిల్ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు అధిక సంఖ్యలో కక్షిదారులు పాల్గొన్నారు.

సొంతింటి కలను సాకారం చేసిన సీఎం జగన్

- మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి



ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి



మక్కువ: ఇంటి హక్కు పత్రాలు పొందిన లబ్ధిదారులతో రంగునాయుడు

పార్వతీపురం టౌన్: పేద మహిళల సొంతింటి కలను సాకారం చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అన్నారు. పురపాలక సంఘానికి చెందిన అక్కాచెల్లెమ్మలకు మంజూరు చేసిన ఇళ్ల పట్టాలను ఆమె శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మీ అందరి ఆశలను నెరవేర్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకేసి మీ పేరిట ఇళ్ల స్థలాలను ఉచిత రిజిస్ట్రేషన్ కూడా చేయించి వాటిపై పూర్తి హక్కు కల్పించారన్నారు. వచ్చే ఎన్నికల్లో మేలు చేసిన వైఎస్సార్‌సీపీ మళ్లీ గెలిచేలా అండగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మక్కువలో..

మక్కువ: మండల కేంద్రంలోని పలు వీధులకు చెందిన 59మంది లబ్ధిదారులకు జగనన్న శాశ్వత ఇంటిహక్కు పత్రాలను శనివారం అందజేశారు. స్థానిక సచివాలయంలో ఏర్పాటు చేసిన జగనన్న ఇంటిహక్కు పత్రాల పంపిణీ కార్యక్రమానికి హాజరైన వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు మాట్లాడుతూ మండల కేంద్రం మక్కువకు చెందిన పేదలకు 330 జగనన్న ఇళ్లు మంజూరు కాగా, దాదాపుగా ఇళ్లు పూర్తి కావచ్చాయన్నారు. ఇళ్లు పూర్తయిన లబ్ధిదారులు ఇంటిహక్కు పత్రాలను అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ సింహాచలం, వెలుగు ఏపీఎం సన్నిబాబు, ఏపీఓ ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

త్వరలో తీరనున్న రహదారి సమస్య



బీటీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: మండలంలోని సువర్ణముఖీ నదిపై బగ్గందొరవలస – గెడ్డలుప్పి మీదుగా కొత్తవలస తదితర 14 గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న రహదారి సమస్య త్వరలో తీరనుందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. బగ్గందొరవలస, గెడ్డలుప్పి గ్రామాల మధ్య వంతెనను అనుకుని రూ. 2 కోట్ల 50 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి ఆయన భూమి పూజ శనివారం నిర్వహించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ గెడ్డలుప్పి గ్రామం మీదుగా పార్వతీపురం – సీతానగరం మండలంలోని 8 గ్రామాలకు, మక్కువ మండలంలోని 6 గ్రామాలకు రహదారి సౌకర్యం లేక దశాబ్దాలు అత్యవసర సేవలు అందక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో దీర్ఘకాల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ తిరుపతినాయుడు, ఎంపీటీసీ సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ సింహాచలం, ఎంపీపీ బి.రవణమ్మ, పార్టీ సీనియర్ నాయకులు బి.శ్రీరాములునాయుడు, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, వైస్ ఎంపీపీ టి.సూర్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు